సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 3 ఫిబ్రవరి 2025 పేజీలు 8

# బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత

## ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే విధంగా ఉందని అభిప్రాయపడిన ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడించారు. బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు అని తెలిపారు. దీర్ఘ ఫలాలు వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు వేశారని, అందుకే బడ్జెట్లో అన్ని రంగాలకు పెద్ద పీట వేశారని వివరించారు. బడ్జెట్ ద్వారా అన్నదాతలకు మేలు జరగనుందని వ్యక్తం చేశారు. ఎంఎస్ ఎంఈలకు ఇచ్చే రుణాలు రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లకు పెంచడం, స్టార్టప్లకు రూ.10కోట్లు నుంచి రూ.20కోట్లకు మిగతా 2లో...

# 9 నుంచి గుణదల మేరీ మాత ఉత్సవాలు

● మూడు రోజుల ఉత్సవాలకు పెద్దఎత్తున్న పాల్గొననున్న భక్తులు ● బందోబస్తు ఏర్పాట్లును పరిశీలించిన సీపీ



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఈనెల 9, 10, 11వ తేదీల్లో విజయవాడ నగరంలో గుణదల మేరీమాత ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ మూడు రోజుల్లో పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో గుణదల మేరీ మాత టెంపుల్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఇతర పోలీస్ అధికారులతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, మిగతా 2లో...



శారీరక, మానసిక ఆరోగ్యం

## సూర్య నమస్కారాలతోనే సాధ్యం

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ● 8లో..



## గన్నవరం నియోజకవర్గ పరిశీలకులుగా కోటా వీరబాబు

వివరాలు 8లో...

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో..

## పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తాత్కాలిక విరామం 3

## బీసీల, కల్లు గీత కులాల ద్రోహి వైయస్.జగన్ 2

## బంటుమిల్లిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

వివరాలు 5లో





# అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర నేడే

ఫిబ్రవరి 3 నుండి 11 వరకు జరిగే జాతరను జయప్రదం చేయండి

ఆలయ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి

ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు



ఆలయ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి

**అమరావతి మేజర్ న్యూస్ :** దుమ్ముగూడెం గ్రామంలో ఎంతో ప్రసిద్ధిచెందిన శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం 23వ జాతరకు ముస్తాబవుతోంది. ప్రతి రెండేళ్ళ కొకసారి ముత్యాలమ్మ తల్లి జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, 2

(మొదటిపేజీ తరువాయి)

## బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత



పెంచడం శుభపరిణామమన్నారు.ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన మహిళలకు టర్మ్‌లోన్ పథ కం ద్వారా రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించడం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.ఈ బడ్జెట్ ద్వారా ఎన్డీయే సర్కార్ రైతు పక్షపాత ప్రభుత్వమని రుజువైందన్నారు. రూ.50,65,345కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.1,71,437 కేటాయించి, వ్యవసాయ రంగ కేంద్రీకృత బడ్జెట్‌గా నిలిచి రైతుల మన్ననలు పొందింది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ పరిమితిని 3 నుంచి 5లక్షలకు పెంచడం, కాటన్ మిషన్ ఏర్పాటు, జాతీయ విత్తన మిషన్ ఏర్పాటు, మత్స్య సంపద వృద్ధికి, ఆక్వా రైతులకు తోడ్పాటు కల్పించే చర్యలు, కొత్తగా అసోంలో యూరియా ప్లాంట్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడం ద్వారా రైతాంగానికి మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది' అని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థినిలకు నేత్రపరీక్షలు, హక్కులపై అవగాహన

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో చల్లపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు నేత్ర పరీక్షా శిబిరం, అవగాహన సమావేశం జరిగింది. ఫౌండేషన్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షులు, మోడరన్ ఐ కేర్ నేత్రవైద్యులు డాక్టర్ జి.భానుమూర్తి బాలికలకు నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టిలోపాలు ఉన్నవారిని గుర్తించి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. అనంతరం మానవ హక్కులు, బాలల హక్కులు, విద్యాహక్కులు, బాల్యవివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలకార్మిక నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.అరుణకుమారి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు, నేత్రవైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీల, కల్లు గీత కులాల ద్రోహి వైయస్ జగన్




**నందిగామ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు బీసీలను అన్ని విధాల హింసించారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,, ఎన్టీఆర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్ అన్నారు. ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ లో ఉన్న కల్లుగీత కార్మికులు గౌడ, గౌడ్, యాత్ర, ఈడిగా, శ్రీశైలం శెట్టిబలిజ, గమల్ల కులాలకు రాష్ట్రంలో మొత్తం 335 మద్యం దుకాణాలను అంటే 10% దుకాణాలను గీత కులాలు వారు ఆర్థిక ప్రగతి లక్ష్యంగా వారికి మద్యం షాపుల్లో రిజర్వేషన్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకుని 10 శాతం మద్యం దుకాణాలను కేటాయిస్తే, మాజీ ముఖ్యమంత్రి బీ.సీల ద్రోహి, గీత కులాల ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాపై కక్షగట్టి తన పార్టీ న్యాయవాదులైన నాగేశ్వరరావు, ఓ మనోహర్ రెడ్డి కేసు వేయించడం చాలా దుర్మార్గమని, నీచమైనపని అనీ వీరాస్వామిన్ ఘాటుగా విమర్శించారు.బీ.సీలు ముఖ్యంగా ఈ రాష్ట్రంలో గౌడ కులస్తులు, కల్లుగీత కార్మికులు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగటం మొదటినుంచి వైయస్సార్ పార్టీ అండ్ జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదని ఆ విషయాన్ని మరొక్కసారి తన నైజాన్ని బీ.సీలపై కక్ష సాధింపును మరొకసారి అతని నైజం అర్థమైందని వీరాస్వామిన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరొక్కసారి తగిన సమయంలో జగన్మోహన్ రెడ్డి కి తగిన గుణపాఠం చెబుతారని జగన్మోహన్ రెడ్డిని వీరాస్వామిన్ హెచ్చరించారు.

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ కలిసిన వైసీపీ నేతలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఏపిలో మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు కోరారు. ఎన్నికల కమిషనర్‌కు వైసీపీ నేతలు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని కలిసిన వారిలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ,వెస్ట్ ఇంచార్జ్ వేలంపల్లి శ్రీనివాస్,సెంట్రల్ ఇంచార్జ్ మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రూహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఉన్నారు.

# అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర నేడే

(మొదటిపేజీ తరువాయి)



కర్నాటక రాష్ట్రాలనుంచి కూడా భక్తులు అమ్మ వారి జాతరకు వచ్చి తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు. మాఘమాసం ఫిబ్రవరి 3 వ తేదీ నుండి ఫిబ్రవరి 11 వరకు తొమ్మిది రోజులపాటు అమ్మవారి జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి తెలిపారు. భక్తులు అమ్మవారి మహిమలను తెలుసుకుని ఈ దేవాలయం వచ్చి మొక్కుకుంటారు. అనంతరం తమ కోర్కెలు ఫలించాయని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. కళ్యాణాలు కాని వారికి అమ్మవారిని దర్శించుకుని మొక్కుకుంటే వెంటనే వివాహాలు జరుగుతాయని పలువురు విశ్వసిస్తున్నారు. జాతర తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రతేక అలంకరణ, విశేషమైన పూలమాలలతో, మేళతాళాలు,డప్పు వాయిద్యాలతో అమ్మవారు పూజలను అందుకొని భక్తులను అనుగ్రహిస్తారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.జాతర వూరేగింపులో గరగరల డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణ !అమ్మవారి జాతరలో తొమ్మిది రోజులలో మూడు పర్యాయాలు అమ్మవారి ప్రతిరూపాలైన గరగరలను డప్పు వాయిద్యాలు,విచిత్ర వేష ధారణలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొని భక్తులు అందించే ప్రసాదాలు, మంగళ హారతులను అమ్మవారికి సమర్పిస్తారు.జాతర చివరి రోజున 11వ తేదీన గరగరల వూరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. తూర్పు గోదావరి జిల్లా కళాకారులచే కాంతారా సెటింగ్స్ తోపాటు భద్ర కాళీమాత నృత్యాలు, గిరిజన నృత్య ప్రదర్శన, కొమ్ము డ్యాన్సులు, డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలు,బాణాసంచాల నడుమ చివరి.ఊరేగింపు జరుగుతుంది. వివిధ ప్రాంతాలనుండి దుమ్ముగూడెం వచ్చిన భక్తులు ఆనందంతో పరవశించిపోతారు.జాతర కార్యక్రమాలను జయప్రదం చేయాలని, భక్తులు సహాయ సహకారాలు అందించవలసిందిగా ఆలయ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతర తొమ్మిది రోజులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నివేల మంది వచ్చినా అన్నదానం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి అమ్మవారి జాతర సమయంలో రాత్రి సమయంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తాయని ముత్యాలమ్మ తల్లి ఆలయ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి కార్యక్రమాలను వివరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పేరుగాంచిన కళాకారులచే జాతరలో ప్రతిరోజూ అమ్మవారి కళావేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.3వ తేదీ మొదటి రోజున హైదరాబాద్ కళాకారులచే బాబీ ఈవెంట్స్,4వ తేదీన హైదరాబాద్ సురభి డ్రామా థియేటర్ వారిచే మాయా బజార్ నాటకం,5వ తేదీన భీమవరం వారిచే మోహన్ ఆర్కెస్ట్రా మ్యూజికల్ నైట్, 6వ తేదీన తణుకు వారిచే స్వప్న ఆర్ట్స్ సినీ డూప్ డ్యాన్స్ హంగామా,7వ తేదిన తాడేపల్లి గూడెం వారిచే గుడ్విల్ ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్, 8వ తేదీన భీమవరం వారిచే స్వాతీ ఆర్కెస్ట్రా, 9వ తేదీన ఉమ్మడి రాష్ట్రాలలో పేరుగాంచిన విశాఖపట్నం వారిచే పల్సర్ బైక్ జాన్సీ, రమేష్ మాష్టర్ డ్యాన్స్ హంగామా,10వ తేదీన విశాఖపట్నం వారిచే సుప్రీం ఆర్కెస్ట్రా సినిమా మ్యూజికల్ నైట్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ గణేష్ రెడ్డి వివరించారు.

# 9 నుంచి గుణదల మేరీ మాత ఉత్సవాలు





(మొదటిపేజీ తరువాయి)

లా అండ్ ఆర్డర్ పరంగా, ట్రాఫిక్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు తగు సూచనలు సలహాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా నగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...... ఈనెల 9వ తేదీ నుంచి నగరంలో గుణదల మేరీమాత ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుని పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈసారి ప్రత్యేకంగా మేరీ మాత టెంపుల్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు డ్రోన్లతో ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుని పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుంది, చిన్నపిల్లల భద్రతపై, నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు, పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్‌తో పాటు డిసిపి గౌతమి షాలి, ట్రాఫిక్ ఏ డి సి పి ఎ. వి. ఎల్ ప్రసన్నకుమార్, సౌత్ ఏసిపి డి.పవన్ కుమార్, ట్రైనీ డీఎస్పీ పావని, ఇన్స్పెక్టర్లు, ఎస్. ఐ. లు, సిబ్బంది పాల్గొన్నారు.









# రోడ్డు ప్రమాదంలో వృద్ధుని దుర్మరణం



చల్లపల్లి మేజర్ న్యూస్ : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలైన విషాదకర సంఘటన చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం పలుగులగండి వద్ద జాతీయరహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల ప్రకారం, రామానగరం గ్రామానికి చెందిన వేములపల్లి వెంకట పూర్ణచంద్రరావు(85) దాలిపర్రులోని బంధువుల ఇంట పెదకర్మ కార్యక్రమానికి వెళ్లివస్తున్నారు. టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై తిరిగివస్తున్న ఆయన దాలిపర్రు రోడ్డులోనుంచి జాతీయరహదారిపైకి మలుపు తిరుగుతున్న సమయంలో బందరువైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుని తలమీదుగా లారీ టైరు వెళ్లటంతో తల ఛిద్రమైంది. సమాచారం అందుకున్న చల్లపల్లి ఎస్ఐ పివిఎస్. సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి సంఘటనా ప్రదేశానికి వెళ్లి ప్రమాద కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్షకు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో నివసిస్తున్నారు. మృతుని మేనల్లుడు బి.సాయివరప్రసాద్ ఫిర్యాదుమేరకు చల్లపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సామ్‌సంగ్ నుంచి బిస్పోక్ ఏఐ విండ్ ఫ్రీ ఏసీ శ్రేణి




విజయవాడ, మేజర్ న్యూస్ : భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తన బిస్పోక్ ఏఐ విండ్ ఫ్రీ ఎయిర్ కండీషనర్ల 2025 శ్రేణిని విడుదల చేసింది. ఇది అత్యాధునిక ఏఐ సాంకేతికత, ప్రీమియం డిజైన్‌ల కలయిక. ఇంటెలిజెంట్ కూలింగ్, ఎనర్జీ ఎఫిషియెన్సీ, కనెక్టెడ్ లివింగ్‌పై దృష్టి సారించి, కొత్త శ్రేణి 19 మోడల్‌లు భారతీయ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న డిమాండ్‌లను తీరుస్తాయి. ఈ ఎయిర్ కండీషనర్‌లు భారతదేశం యొక్క తీవ్రమైన వేసవికాల సవాళ్లను పరిష్కరించేటప్పుడు సౌకర్యం, సౌలభ్యం, ఆవిష్కరణలను అందించడానికి ఆలోచనాత్మకంగా రూపొందించబడ్డాయి.

## చిక్కవరంలో సుందరయ్య రెడ్ వాలెంటీర్స్ శ్రమదానం



గన్నవరం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ : ఆదివారం సుందరయ్య రెడ్ వాలెంటీర్స్, చిక్కవరం గ్రామంలోని జయశ్రీ పాలిమర్స్ కార్మికులు కలిసి చిక్కవరంలోని ఎలిమెంటరీ స్కూల్, చెరువు గట్టు పరిసర ప్రాంతాలను శ్రమదానం చేసి శుభ్రం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో చిక్క వరం గ్రామ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తమ సహాయ సహకారాలు అందించారు. సుందరయ్య రెడ్ వాలంటీర్లు మల్లంపల్లి ఆంజనే యులు, కల్లెం కోటయ్య, సి హెచ్, రాజేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, నాగరాజు, జయశ్రీ పాలిమర్స్ సంస్థ మేనేజరు, జనరల్ మేనేజరు, కార్మికులు తదితరులు పాల్గొని శ్రమదాన కార్యక్రమం విజయవంతం గా నిర్వహించినారు.

## సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీలకు
### విజయా అకాడమీ విద్యార్థినిలు



చల్లపల్లి మేజర్ న్యూస్ : చల్లపల్లి శ్రీ విజయా అకాడమీ విద్యార్థినిలు వాలీబాల్ జూనియర్స్ విభాగంలో వక్కలగడ్డ జడ్పీహైస్కూల్ టీజెట్లు విజయం సాధించి సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. లింగారెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్లో కృష్ణాజిల్లా సెకండరీ స్కూల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాల్బాడ్మింటన్, షటిల్ పోటీలు జరుగ్గా, విజయా అకాడమీ విద్యార్థినిలు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్లో లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీలు టి.అర్జునరావు, ఎం.కోటయ్యలను ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు అభినందించారు.

## వైసీపీ బీసీ నేత మృతి
### నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి





(ఫైల్ ఫోటో)

అవనిగడ్డ, మేజర్ న్యూస్ : అవనిగడ్డ 6వ వార్డ్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు అవనిగడ్డ వెంకటేశ్వరరావు (మెకానిక్ వెంకటేశ్వరరావు) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు 6వ వార్డు లోని వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు ఇలా హఠాత్తుగా గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని, పార్టీ ఒక నిస్వార్థనాయకుని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు,ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మోటార్ సైకిల్ మెకానిక్ లు, ప్రజాప్రతినిధులు పాల్గొని వెంకటేశ్వర్రావు కు ఘన నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



(ఫైల్ ఫోటో)

అవనిగడ్డ, మేజర్ న్యూస్ : అవనిగడ్డలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం మండల పరిధిలోని పులిగడ్డ జాతీయ రహదారి-216పై ఈ ఘటన జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అవనిగడ్డ రెండవ వార్డ్ కి చెందిన కోసూరు అభిరామ్ (32) తన ద్విచక్ర వాహనంపై మోపిదేవి షాపు నుంచి మధ్యాహ్నం భోజనానికి అవనిగడ్డ ద్విచక్ర వాహనంపై వస్తుండగా పులిగడ్డ సర్కిల్ సమీపంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో అభిరామ్ కి తీవ్ర గాయం కావడంతో అక్కడే మృతి చెందాడు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు చేర్చగా పోస్టుమార్టం అనంతరం అభిరామ్ మృతదేహాన్ని బంధువులకి అప్పగించారు. మృతి చెందిన అభిరామ్ కు భార్య,పాప,బాబు ఉన్నారు. ఈ సంఘటనతో అవనిగడ్డలో విషాదఛాయలు అలుముకున్నాయి ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నీళ్ల కుంటలో పడి వ్యక్తి మృతి



కంచికచర్ల ఫిబ్రవరి 2 మేజర్ న్యూస్ : పొలంలో ప్రమాదవశాత్తు నీళ్ల కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కీసర గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన ఆకుల పూర్ణచంద్రరావు గండేపల్లి రోడ్డులో గల పొలంలో టమాట తోటకు నీళ్లు పెట్టే క్రమంలో కుంట వద్ద నీళ్ల తేవడానికి వెళ్లి కాలుజారి నీటి కుంటలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులు శోకసముద్రంలో విలవిలలాడుతున్నారు.

### ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో..
## కార్పొరేషన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లేదు
### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : కృష్ణ గుంటూరు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం కార్పొరేషన్ లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ఫిబ్రవరి 3వ తేదీ నుండి మార్చి 8వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

### శాసనమండలి పట్టభద్రుల ఎన్నిక నేపథ్యంలో..
## మీకోసం కార్యక్రమానికి తాత్కాలిక విరామం
### పిజిఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో సమస్యలను నమోదు చేసుకోవచ్చు
### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ద్వై వార్షిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో కృష్ణా జిల్లాలో కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.భారత ఎన్నికల సంఘం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికకు జనవరి 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసి తక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ( ఎంసిసి) అమలులో ఉంటుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల మూడవ తేదీ నుండి మార్చి 8వ తేదీ వరకు కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం (పిజిఆర్ఎస్) 'మీకోసం' కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని, అయితే పిజిఆర్ఎస్ ఆన్ లైన్ పోర్టల్ లో తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ ఆ ప్రకటనలో తెలిపారు.

## పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తాత్కాలిక విరామం...
- మీకోసం పోర్టల్ లో గ్రీవెన్స్ నమోదుకు సమీప సచివాలయాన్ని సంప్రదించొచ్చు.
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : కృష్ణా - గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు జనవరి 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల మూడవ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ ఆ ప్రకటనలో తెలిపారు. అయితే ప్రజలు తమ అర్జీని మీకోసం ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చని.. ఇందుకు తమ సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తాత్కాలిక విరామం
### పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజా శేఖర బాబు

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : కృష్ణా - గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజా శేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు జనవరి 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల మూడవ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించడం జరిగిందని పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజా శేఖర బాబు ప్రకటనలో తెలిపారు.



## ఉచిత కుట్టు మిషన్ వర్క్ షాప్‌ను ప్రారంభించిన పంతం వెంకట గజేంద్ర రావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో కుట్టు మిషన్ జూట్ బ్యాగ్స్ స్కూల్ బ్యాగ్స్ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న బిజెపి నాయకురాలు నల్లగోపుల అమ్మాజీ ఆధ్వర్యంలో మచిలీపట్నం మండలం శ్రీనివాస్ నగర్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు శిక్షణ పొందుతున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంత వెంకట గజేంద్రరావు పాల్గొని ఉచిత శిక్షణ ఇస్తున్న కార్యశాలను ప్రారంభించి, వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు గ్రామాలలో అనేక మంది మహిళలకు ఉన్నతికి శిక్షణ కార్యక్రమాలు చేస్తున్నారని వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కలగజేస్తూ వారికి మనోధైర్యం ఇస్తున్న రోటరీవారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జాయింట్ గవర్నర్ జ్యోతి ప్రముఖ న్యాయవాది అహ్మద్ ఉన్నిసా ప్రెసిడెంట్ మోజేష్ సెక్రటరీ అనుపమ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**పామర్రు ఫిబ్రవరి 2 మేజర్ న్యూస్ :** పామర్రు మండలం పెరిశేపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన వేములపల్లి వెంకట నారాయణ కుమార్తె వివాహ వేడుకలలో స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అలాగే వెంకటనారాయణ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీదాసు తదితరులు ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్నారు.

## పుట్లమ్మ తల్లి ఆలయంలో కైలే ప్రత్యేక పూజలు



**పామర్రు ఫిబ్రవరి 2 మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదివారం స్థానిక పుట్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించి అనంతరం ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్‌తో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు డా. తిపిర్నేనేని లక్ష్మీ పెరుమాళ్ళు, ప్రభావతి, చలసాని చౌదరి రాయన్ ల జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ వారి సహకారంతో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పలువురు వైద్య సేవలను పొందారు. కోతిబొమ్మ సెంటర్లోని ప్రభావతి గార్డెన్స్ లో జరిగిన ఈ క్యాంపులో ఎముకలు, సాధారణ వ్యాధులకు సంబంధించిన విభాగాలకు చెందిన డా.సాయినాథ్, డా.ఐ.లావణ్య, డా.కె.ధనుష్, డా.వి. మనస్వి లు వైద్య సేవలను అందించారు. వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జి.కిరణ్ బాబు, పూర్వ అధ్యక్షులు పి.రామకృష్ణ, బి.శంకరరావు, సభ్యులు ఎ.మహదేవ దేశాయ్, ఎస్. ఉదయ భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఆనందోత్సాహాలతో..

# ఘనంగా పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




### గురువులను సన్మానించిన అలనాటి విద్యార్థులు

**కంచికచర్ల ఫిబ్రవరి 2 మేజర్ న్యూస్ :** మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 సంవత్సరం బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన అలనాటి విద్యార్థిని విద్యార్థులు సుమారు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకొని రోజంతా అత్యంత ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందోత్సాహాలతో గడిపారు. ఒకరినొకరు ప్రస్తుతం ఏహోదాలో ఉన్నారో పరిచయం చేసుకుంటూ ఉద్వేగభరిత క్షణాలు గడిపారు. అలనాటి మధుర స్మృతులు నెమరు చేసుకుంటూ, ప్రస్తుత జీవనంలో స్థిరపడిన అంశాల గురించి చర్చించుకుంటూ రోజంతా గురువులతో మమేకమై ఉల్లాసంగా కాలం గడిపారు. ఆనాడు గురువులు తమను తీర్చిదిద్దిన విధానాల గురించి, తమ పురోభివృద్ధికి గురువులు ఎంతగానో తోడ్పడ్డారన్న విషయాల గురించి నెమరు వేసుకున్నారు. 1986-87 పూర్వ విద్యార్థుల సదస్సును ఉద్దేశించి పలువువు ఉపాధ్యాయులు, మాట్లాడుతూ తమ మార్గదర్శకత్వంలో విద్యార్థులు నేడు ఉన్నత స్థితికి చేరుకోవటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మూడు దశాబ్దాల తర్వాత కూడా తమ స్నేహ బంధాన్ని నిలుపుకుంటూ ఒకరినొకరు కలుసుకోవడం, స్నేహపూర్వక వాతావరణంలో తమ భావాలను వ్యక్తీకరించుకోవడం అనందదాయకం అన్నారు. ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడిన ప్రతి ఒక్కరు సమాజం పట్ల కూడా గురుతర బాధ్యత వహించి, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. తమ బిడ్డలను సైతం ఉన్నత విద్యావంతులుగా, మంచి వ్యక్తిత్వంతో తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. చిన్ననాటి నుండే వాళ్లకి ఉన్నత విలువలు నేర్పాలన్నారు. చాలా కాలం తర్వాత అలనాటి విద్యార్థులు గురువులను ఒక వేదికపై చేర్చటం ఒక అపూర్వ కలయిక అని, వేడుకగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా గురుశిష్యుల మైత్రి బంధం భావితరాల వారికి తెలియ చెప్పినట్లు అయిందన్నారు. తమ గురువులు, నేర్పిన చదువు, చూపిన బాట వల్లే వల్లే తామునేడు ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోగలిగామని అలనాటి విద్యార్థులు పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అలనాటి గురువులను, విద్యార్థిని విద్యార్థులు శాలువాలతో, మెంటోలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బండి మల్లికార్జున రావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వెలగా సాంబశివరావు, రజిని, శారద, రమాదేవి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



# పసల తోమాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన పండుగ



**గన్నవరం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** శ్రీ బాల యేసు దేవాలయం విచారణ కర్తలు పసల తోమాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. విచారణలోని క్రైస్తవ సహోదరీ సహోదరులు కొవ్వొ త్తులను చేత బూని భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ముఖ్య అతి థులుగా ఫాదర్ రాకేష్ ఫాదర్ వినోద్ పాల్గొన్నారు అనం తరం నిర్వహించిన దివ్యబలి పూజ నిర్వహించారు. విశ్వ శ్రీసభ బాలయేసును యెరూషలేము దేవాలయమున సమర్పణ పండుగను కొనియాడుతూ ఉంది. దీన్నే కొవ్వొత్తుల ప్రదర్శన పండుగని ఐదవ శతాబ్దంలో తెలియజేశారు. మరియ తల్లి యొక్క శుద్ధికరణ పండుగ అని కూడా కొనియా డతారు. డిసెంబరు 25వ తేదీ నుండి ఏసుప్రభువుకి నేటి ఆదివారంకు 40 రోజుల వయసు. యూదుల ఆచార సాంప్రదాయ ప్రకారం దేవాలయానికి తీసుకుని రావాలని. దైవ ప్రేరణతో సిమియోను ప్రవక్త అన్నమ్మ అనే ప్రవర్తి ఆదివారం దేవాలయానికి వచ్చారు. ప్రభు యొక్క గొప్పతనాన్ని కొనియాడారు. ఫాదర్ రాజేష్ ప్రసంగిస్తూ మన బిడ్డలను దేవాలయానికి సమర్పిస్తున్నామా? మన కతోలిక ఆచార సాంప్రదాయాలను పాటిస్తున్నామా? ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకోవాలని చెప్పారు. ఆత్మ శుద్ధికరణ, కతోలిక ఆచార సాంప్రదాయాలను పాటించాలని తిరు కుటుంబాల సాంప్రదాయాలను పాటించేలా జీవించాలని ఫాదర్ రాకేష్ భక్తులను ఉద్దేశించి దివ్యబలి పూజలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విచారణ ఉపదేషులు, మరియదళ సభ్యులు సంఘ పెద్దలు భక్తులు ఈ పండుగను కొనియాడారు.

# వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు వ్యాఖ్యలు అర్థరహితం



**నందిగామ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలో వైసిపి నాయకులు వారి అవినీతిని కప్పిపుచ్చుకోవటం కోసం, జగన్ మెప్పు కోసం ఎంపి కేశినేని శివనాథ్ పై గానీ, ఎన్డీయే కూటమి నాయకులపై గానీ తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదంటూ ఎన్టీఆర్ జిల్లా దిశ కమిటీ సభ్యురాలు నందిగామ మాజీ ఎంపీపీ రాష్ట్ర తెలుగు మహిళ మాజీ కార్యదర్శి మన్నెం కళావతి, మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వర హెచ్చరించారు. పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతూ ఇసుక అక్రమ రవాణా ఎంపి కేశినేని శివనాథ్ అండదండలతో జరుగుతుందని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నందిగామ మండలం కొండూరు గ్రామ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా దిశ కమిటీ సభ్యురాలు నందిగామ మాజీ ఎంపీపీ రాష్ట్ర తెలుగు మహిళ మాజీ కార్యదర్శి మన్నే కళావతి, నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు(బుజ్జి) మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన్నీరు నాగేశ్వరరావు నోరు అదుపులో పెట్టుకొని, వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని లేకపోతే పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో ఇసుక పేరుతో పేద ప్రజల సొమ్మును దోచుకోని దాచుకున్నారని మండిపడ్డారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన తన్నీరు నాగేశ్వరరావు అవినీతి జరిగిందని మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు.నిత్యం ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి, జిల్లా వాసుల సంక్షేమం కోసం శ్రమించే ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ను విమర్శించే స్థాయి జగ్గయ్యపేటకు వలస పక్షిగా వచ్చిన తన్నీరు నాగేశ్వరరావుకి లేదన్నారు. ఈ నియోజకవర్గానికి రాక ముందు, విజ్ఞాన విద్యాసంస్థలు పెట్టక ముందు వున్న ఆస్తుల వివరాలు, విజ్ఞాన్ విద్యాసంస్థల పేరుతో సామాన్య ప్రజల వద్ద దోచుకుని సంపాదించిన ఆస్తుల వివరాలు అందరికీ తెలుసునన్నారు.కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవ, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనస్సులు గెల్చుకున్న తర్వాతే ఎం పి గా పోటీ చేసి భారీమెజార్టీ తో గెలిచిన విషయం వైసిపి నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. వ్యాపార రంగంలో తను సంపాదించిన సొమ్ములో కొంత సమాజానికి ఖర్చు చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి ఎంపి కేశినేని శివనాథ్ వచ్చారన్నారు. ఎంపి గా గెలిచిన తర్వాత కూడా కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ ను అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ పార్లమెంట్ గా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్న ఎంపి కేశినేని శివనాథ్ పై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయటం తన్నీరు నాగేశ్వరరావు దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. ప్రజలందరికీ ఉచితంగా ఇసుక లభిస్తుంటే ఇసుకలో ఏ విధంగా దోపిడి జరుగుతుందో సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు.వైసిపి అవినీతిని భరించలేక ప్రజలు ప్రజాస్వామ్య పద్దతిలో తరిమికొట్టిన బుద్ధి రాకపోవటం సిగ్గు చేటన్నారు, ఇక పై ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తే నియోజకవర్గ ప్రజలే వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తో పాటు వైసిపి నాయకుల్ని తరిమికొడతారని జాగ్రత్తగా వుండాలని హెచ్చరించారు.

# హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**పెడన మేజర్ న్యూస్ :** పట్టణంలోని 5వ వార్డ్ లో గల హిందూ స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు అభివృద్ధి పరచి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ని ఆదివారం హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ కోరుతూ ఒక వినతి పత్రాన్ని అందించామని అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శాసన సభ్యుల వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని హిందూ స్మశాన వాటికను అభివృద్ధి పరుస్తానని ఎన్నికలవేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం నుండి, ఇతర ప్రజా ప్రతినిధుల నుండి నిధులు కేటాయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అభివృద్ధి కమిటీకి హామీ ఇచ్చారు. అలాగే హిందూ స్మశాన వాటిక లోని ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త చెదారాన్ని తక్షణమే తొలగించేలా మున్సిపల్ కమిషనర్కి ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. అలాగే భవిష్యత్తులో హిందూ స్మశాన వాటికకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించి ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన నిధులను వచ్చేలా చూస్తానని అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా పట్టణంలో ఉన్న హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కి నోచుకోక ఖనన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హిందూ స్మశాన వాటిక లోని అనేక సమస్యలను శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లి వివరించామన్నారు. దీంతో స్పందించిన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ వాటి పరిష్కారానికి పార్లమెంటు సభ్యులు తో కలిసి చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా హేమ సుందరమూర్తి, ఊటుకూరి ప్రకాశరావు, బళ్ల ప్రసాద్, గోరు.రాజు, కమ్మగంటి వెంకటేశ్వరరావు, గుల్లంకి మాధవరావు, కొసనం లోకనాథరావు, వాసా సాంబశివరావు, తమ్మ భీమయ్య ఇతర దేవాంగ కర్ణోద్ధువ,ఇతర సామాజిక పెద్దలు ఉన్నారు.

# సందడిగా 1984-85 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## అరె ఒరే అంటూ కేరింతలు కొట్టినవైనం

**గన్నవరం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** వాళ్లందరూ నాలుగు దశాబ్దాల క్రితం పదవ తరగతి చదువుకున్నారు. పిల్లలు మనములు, మనుమలాంద్రలతో ఆడుకుంటూ వివిధ ఉద్యోగాలు చేస్తూ దేశ విదేశాలలో స్థిరపడ్డారు. అందరిని కలపాలని ఆలోచన ఆ బ్యాచ్ కు చెందిన కస్తూరి అప్పారావుకు తట్టింది. అదే తరువాయి వెంటనే వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. అందులో వారితో పాటు చదివిన వారిని మందిని యాడ్ చేశారు. కొంతమంది విదేశాల్లో, మరికొందరు సుధీర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అందరూ ఫిబ్రవరి 2 న వారు చదివిన గన్నవరం బాలుర హైస్కూల్లో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం జరిగిన 1984-85 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనం గా జరిగింది. ఈ సమ్మేళనానికి 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వారందరూ అరే ఒరే అంటూ పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. ఎవరెవరు ఎక్కడ ఉంటున్నారు అడిగి తెలుసుకున్నారు. విద్య బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులైన టిఎస్ఆర్కె.ప్రసాద్, కె.జయరాజు, పి రామానుజ చార్యులు, డి సాంబశివరావులను పూల మాలలు దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జోక్స్ వేసుకుంటూ పాటలు పాడుతూ డాన్సులు చేశారు. మళ్లీ విద్యార్థి దశలోకి వచ్చామంటూ కేరింతలు కొట్టారు. వీళ్ళను చూసి ఉపాధ్యాయులు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో కార్యదర్శి దామెర సీతారామయ్య, కోశాధికారి కోనేరు రవికుమార్, ఆత్మీయ కలయిక జీవితకాల స్పాన్సర్ కొల్లిపర శివప్రసాద్, సజ్జ శ్రీనివాసరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

## ఎస్.ఎస్.ఆర్. దంపతులు ప్రతిష్ఠించిన సరస్వతీదేవికి ఘనంగా పూజలు






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సంగీతం కళలకు దేవత అయిన సరస్వతీ దేవిని వసంత పంచమి రోజున ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ పవిత్రమైన రోజే సరస్వతీదేవి జన్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. హిందూ పంచాంగం ప్రకారం, ప్రతి ఏడాది మాఘమాసంలో శుద్ధ పంచమి రోజున " వసంత పంచమిని జరుపుకుంటారు. ఈ పండుగ పర్వదినాన ప్రతి పాఠశాల,కళాశాలతో పాటు ప్రముఖ బాసరలోని సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బ్రహ్మదేవుని నోటి నుండి సరస్వతీ మాత ఆవిర్భవించిందని ఈ రోజు సరస్వతీ మాత దర్శనమిచ్చి ఈ లోకానికి ఒక శబ్దాన్ని ఇచ్చిందని చెబుతారు. వసంత ఋతువు ప్రారంభంలో ఆహ్లాదకరమైన వాతావరణం ప్రారంభం అవుతుంది. సరస్వతీ దేవి అహింసా దేవి, చేతిలో ఆయుధాలు ఏమి ధరించని దేవత. తెల్లటి పద్మం మీద సరస్వతీ దేవి నిలబడి వున్నట్లు ఒక కాలు నిలువుగాను, మరొక కాలు దానిమీద అడ్డంగాను వుంచుకుని ఒకచేత వీణ, మరొక చేత పుస్తకం ధరించినట్లు పురాణ లిఖితం. తెల్లటి చీరె, తెల్లటి పూలు ధరించి సరస్వతీ దేవి శాంతి దేవతగా దర్శనమిస్తుంది. ఈ రోజున పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం వల్ల వారు త్వరగా పురోగమిస్తారని ఇంట్లో కూడా సానుకూల శక్తి ప్రవాహం పెరుగుతుందని, మనసు ఏకాగ్రతతో వుంటుందని చెబుతారు. కృష్ణా జిల్లా, బంటుమిల్లి లో గత ఏడాది సరస్వతీ దేవి విగ్రహం ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు, జానకీ లక్ష్మి దంపతులు ప్రతిష్ఠించారు. విద్యార్దులు సరస్వతీ దేవి పూజలు చేస్తున్నారు. విద్య ఉద్యోగాల్లో రాణించేందుకు, పురోగమించేందుకు మహా సరస్వతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం, సోమవారం కూడా విశేషంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నట్లు బంటుమిల్లి త్రిశక్తి పీఠం (శ్రీ కనక దుర్గమ్మ తల్లి ఆలయం) ధర్మకర్త గరికిపాటి కూనారావు తెలిపారు.సోమవారం ఉదయం పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.ఎస్.ఎస్.ఆర్. దంపతులచే భక్తులకు ప్రసాదం వితరణ ఆధ్యాత్మిక సేవకులు, సరస్వతీ దేవి విగ్రహం ప్రతిష్ట దాత ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు, జానకీ లక్ష్మి దంపతుల ఆద్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి, నిమ్మకాయ పులిహోర ప్రసాదం పంపిణీ చేస్తున్నారు.



## వైభవంగా ఆదిత్యుని శాంతి కల్యాణం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో కొలువై ఉన్న ఉష పద్మిని సమేత సూర్యనారాయణ స్వామివారి శాంతి కళ్యాణం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి నేతృత్వంలో స్వామివారిని కృష్ణా జలాలతో అభిషేకించి, ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సిద్ధాంతి పగలపాటి రామ చంద్రరావు, ఆలయ ధర్మకర్తలు తుంగల వీర వసంతరావు, ఇందిరల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. భక్తులకు కావలసిన ఏర్పా ట్లను ఆలయ నిర్వహకులు పర్యవేక్షించారు.

## ఎంపీపై సీపీఐ నేత శంకర్ వ్యాఖ్యలు సరికాదు

### టీడీపీ మండల అధ్యక్షులు గడ్డి కృష్ణ రెడ్డి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** సిపిఐ నాయకులు దోనెపూడి శంకర్ విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పై చేసిన నిరాధారమైన వ్యాఖ్యాలను ఖండి స్తున్నామని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి అన్నారు. ఏ కొండూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేశినేని చిన్ని ప్రజల మనిషి అని గుర్తుపెట్టుకోవాలి అన్నారు. రాజకీయల్లో గొప్పఆచరణతో ప్రజలు పట్ల ఎన్నో సేవ కార్యక్రమాలు చేసికోట్లు రూపాయలు ఖర్చు పెట్టివిజయవాడ ప్రాతంలోనే గొప్ప ఆదర్శ నాయకుడిగాజనం గుండెల్లోముద్ర వేసుకున్నారన్నారు. కమ్యూనిస్ట్ లు అంటేమాకు చాలా గౌరవం ఉందనిమీలాంటి వ్యక్తులు వల్ల అది సన్నగిల్లుతుందన్నారు. ఎంపీపై చేసిన ఆరోపణలునిజం అని నిరూపించ లేరన్నారు. శంకర్ అనే వ్యక్తి వసూళ్లు మొదలు పెట్టారని పార్టీ కార్యక్రమాలు ఉన్నాయని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నది ఎవరోవిజయవాడ ప్రజలకు బాగా తెలుసన్నారు. ఉచిత ఇసుక ఇప్పుడు పేదలకు ఒక వరం లాంటిదని, పేదవారు, భవన నిర్మాణ కార్మికులు ఉచిత ఇసుక వల్ల సంతోషంగా ఉన్నారన్నారు. ఉచిత ఇసుకలో ఏ విధంగా దోపిడీ జరుగుతుందో సీపీఐ శంకర్ చెప్పాలన్నారు. గతంలో ఏడు వేలు వున్న ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు ఉచిత ఇసుక పుణ్యంతో కేవలం రెండు వేలకే లభిస్తుందని తెలిపారు. ఎంపీ ముందు వున్నది ఒక్కటే 25 పార్లమెంట్ స్థానాల్లో విజయవాడ నుపరిశ్రమలు హాబ్ గా మార్చాలన్నదివారి కల అన్నారు. అటువంటి ఎంపీమీద అనుచిత వ్యాఖ్యలు చేయటం ఖండిస్తున్నామన్నారు. సీపీఐ లో సిద్ధాంత పరంగా రాజకీయాలఉంటాయి కానీ మీరు సిద్ధాంతాలకి వ్యతిరేకం చేస్తున్నారన్నారు. ఏది పడితే అది మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పుడు నదుల్లో ఇసుక పుష్కలంగా లభిస్తుందని చెప్పారు. సీపీఐ అధిష్ఠానం శంకర్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉత్సవ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత



**పెడన మేజర్ న్యూస్ :** మండల పరిధి బల్లిపర్రు గ్రామంలో పార్వతి పరమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం చేసే తీర్థప్రసాదాలు అందించామని ఆలయ పాలకమండలి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు శలపాటి ప్రసాదు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాదు, జనసేన నియోజకవర్గం నాయకులు దాసరి సత్యనారాయణ,, కూటమి ప్రభుత్వం నాయకులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం






**ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ. విద్యాసాగర్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం లోని వివిధ విభాగాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, అన్నారు. అసోసియేషన్ లో భాగమైన మహిళా ఉద్యోగుల విభాగం కార్యవర్గ సమావేశం ఆదివారం గాంధీనగర్ లోని ఏపీ ఎన్జీజీఓ హోమ్‌లో మహిళా సంఘం అధ్యక్షురాలు నిర్మల కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఏపీ ఎన్జీజీఓ సంఘంలో మహిళలకు ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశాలలో వారికి సంపూర్ణ రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకునేలా సంఘం కృషి చేస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎ. విద్యాసాగర్ ను మహిళా ఉద్యోగులు ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తమ కుటుంబ జీవితంతో పాటు అసోసియేషన్ కార్యకలాపాలలో సైతం చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళా ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర నాయకత్వం ఎప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని ఉన్నతాధికారులను, మంత్రులను కలిసినప్పుడు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు అనుభవించిన మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులను ఒక్కొక్కటిగా అధిగమిస్తామన్నారు. గతంలో ఒకటో తేదీన జీతాలు వస్తాయో లేదో అని ఆందోళన పడిన ఉద్యోగులు నూతన ప్రభుత్వంలో ఒకటవ తేదీ నాడు జీతాలు అందుకునే పరిస్థితి వచ్చిందన్నారు. చైల్డ్ కేర్ లీవ్ ని అందరు మహిళా ఉద్యోగులు ఉపయోగపడే విధంగా ఉండాలని సమావేశంలో మహిళ ఉద్యోగులు రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువచ్చారు. మహిళ ఉద్యోగులకి ఇచ్చిన ఐదు రోజుల స్పెషల్ క్యాజువల్ ఇవ్వని మెడికల్ డిపార్ట్మెంట్లోని రెగ్యులర్ మహిళా ఉద్యోగులకు కూడా అమలు అయ్యేటట్టు చూడాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు మీద చర్చ జరిగింది. అలాగే మిగతా సమస్యలు కూడా దశల వారీగా పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో మహిళా ఉద్యోగ సంఘం కన్వీనర్ మాధవి, రాష్ట్ర కార్యదర్శి తులసి రత్నం, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి జానకి, ఆల్ ఇండియా ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఆల్ ఇండియా ఎన్ఈసీ సభ్యురాలు శాంతి శ్రీ, రాష్ట్ర మహిళా విభాగం జిల్లా, తాలూకా, రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల కార్యక్రమం






**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు - 2025 సందర్భంగా తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల కార్యక్రమం జరిగింది. కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు సాహితీ వేదిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి నిర్వాహకుల ఆహ్వానం మేరకు విచ్చేసిన పురస్కార గ్రహీతలకు ముఖ్య అతిథి, అవనిగడ్డ ఎమ్మెల్యే, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు కవులు, రచయితల నూతన పుస్తకాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు.

# ధరణి డెవలపర్స్ అండ్ బిల్డర్స్ వెంచర్‌కు శంకుస్థాపన

**జగ్గయ్యపేట మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేటనియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటుచేసిన జగ్గయ్యపేట ముత్యాల రోడ్ లో ధరణి వెంచర్ను ఆదివారం నాడు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరాం ధనుంజయ చినబాబు ప్రారంభించారు ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రజలు ఎప్పటికప్పుడు నూతనైకరణ కై పయనిస్తున్నారని విశాలమైన భూములలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ వెంచర్ ఏర్పాటు చేయటం సంతోషదాయకం అన్నారు కె బాలకృష్ణ ఎస్ రవితేజ జి గోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో విశాలమైన రోడ్లను ఏర్పాటు చేసి ఈ యొక్క వెంచర్ ప్రతి ఒక్కరికి ధరలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అన్ని వర్గాలకు అందుబాటులో ధరలు జగ్గయ్యపేట పట్టణానికి కూతవేటు దూరంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ధరలు ఉన్నాయి సౌత్ ఇండియా ఫస్ట్ రివర్ వ్యూ దగ్గరలో ఉండటం పక్కనే అలకనంద విల్లాస్ ఏర్పాటు చేసి ఉండటం వంద అడుగుల హైవే తెలంగాణకు సమీపంలో కోటిలింగాల టెంపుల్ కు దగ్గరలో అంతేగాక ముత్యాల కృష్ణా నదిపై గుంటూరు జిల్లాకు అనుసంధానం చేస్తూ బ్రిడ్జి కూడా ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది ఎంతో చారిత్రాత్మకమైన ముత్యాల రాజు కోట కూడా రెండు కిలోమీటర్లు సమీపంలోనే ఉండటం శుభపరిణామం అంతేగాక జగ్గయ్యపేట కూడా కూతవేటు దూరంలో ఉండటం పెట్రోల్ బంకులు కూడా సమీపంలో





ఉండటంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు విశాలమైన అంతర్గత రోడ్లు మంచి ఎర్రటినేల ఉండటం వల్ల నిర్మాణాలకు అనువుగా ఉంటుందనివినియోగదారులు అభిప్రాయపడుతున్నారు పైగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం దూసుకు వెళుతున్న తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలకే విక్రయిస్తున్నందున ఎక్కువ శాతం ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా ధరణి డెవలపర్స్ అండ్ బిల్డర్స్ యాజమాన్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించామని సూశాలమైన భూమిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వెంచర్స్ ఉన్నాయని గతంలో మాకు వెంచర్స్, నిర్మాణరంగంపై అపారమైన అనుభవం ఉన్నదని ఆసక్తి ఉన్నవారికి ఫామ్ హౌస్ లకు కూడా ఏర్పాటు చేసుకోవడానికి ఉన్నదని వారు తెలియజేశారు.

# కాబోయే అమ్మలు.. ర్యాంప్‌పై తళుక్కుమన్నారు



**వినూత్నంగా అను మై బేబీ 3వ వార్షికోత్సవం**

**ర్యాంప్ వాక్‌తో అదరగొట్టిన గర్భిణీలు**

**కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ సినీ తార పూర్ణ**

**అను మై బేబీలో అందుబాటులో హైరిస్క్ ప్రెగ్నెన్సీ, వాటర్ బర్త్, పెయిన్ లెస్ డెలివరీ సేవలు**

**సేఫ్ హాండ్స్ ప్రోగ్రామ్ ద్వారా 80 కి.మీ. పరిధిలో ఎన్ఐసీయూ చికిత్సలు**

**అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి**

**విజయవాడ మేజర్ న్యూస్ :** త్వరలో అమ్మలు కాబోతున్న మహిళలు.. ర్యాంప్‌పై తళుక్కుమన్నారు. పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న స్త్రీమూర్తుల ఆత్మవిశ్వాసం ర్యాంప్ వాక్ ను మరింత అందంగా మార్చింది. అను మై బేబీ 3వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. ఎనికేపాడు అను మై బేబీ హాస్పిటల్‌లో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ తార పూర్ణ.. కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణతో కాబోయే అమ్మలు ర్యాంప్ వాక్ చేయడం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా సినీ హీరోయిన్ పూర్ణ మాట్లాడుతూ.. అను మై బేబీ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. కాబోయే అమ్మల ర్యాంప్ వాక్ లో భాగస్వామ్యం కావడం తనకు అద్భుతమైన అనుభూతినిచ్చిందని తెలిపారు. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మ కొలువుదీరిన విజయవాడ నగరంలో నారీ శక్తికి నిజమైన నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలిచిపోతుందని పూర్ణ వ్యాఖ్యానించారు. అనంతరం, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ.. అను మై బేబీ మూడేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించిందని అన్నారు. విశిష్టానుభవం కలిగిన వైద్య నిపుణులతో, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అను మై బేబీలో వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అనేక క్లిష్టమైన కేసుల్లో సైతం తమ వైద్యులు అత్యంత నైపుణ్యంతో చికిత్సనందించి చరిత్ర సృష్టించారని తెలియజేశారు. అను మై బేబీలోని ప్రపంచ స్థాయి సదుపాయాల ద్వారా హైరిస్క్ ప్రెగ్నెన్సీ, వాటర్ బర్త్, పెయిన్ లెస్ డెలివరీ సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. సేఫ్ హాండ్స్ ప్రోగ్రామ్ ద్వారా 80 కి.మీ. పరిధిలో ఎమర్జెన్సీ నియోనేటల్ చికిత్సలను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఒకే ఒక్క ఫోన్ కాల్ ద్వారా నవజాత శిశువులకు అత్యాధునిక అత్యవసర చికిత్సలను అందిస్తామని తెలిపారు. ఇందు కోసం వెంటిలేటర్, తదితర వసతులతో అంబులెన్స్, ప్రత్యేక ఎన్ఐసీయూ విభాగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అను మై బేబీ వార్షికోత్సవ స్ఫూర్తితో, ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలందించాలనే తమ లక్ష్య సాధనలో పునరంకితమవుతామని డాక్టర్ శ్రీదేవి తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ర్యాంప్ వాక్ లో పాల్గొన్న గర్భిణీలను అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అను మై బేబీ వైద్యులు డాక్టర్ కవిత, డాక్టర్ పావని, డాక్టర్ మంజు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా క్రక్స్ బయోటెక్ ప్లాంట్ 2 ప్రారంభోత్సవం





**నందిగామ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** మండలంలోని పెద్దవరం గ్రామంలో ఆదివారం నాడు క్రక్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ -2 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు యాజమాన్యంతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ మేరకు క్రక్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ యాజమాన్యం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి గోగినేని రవిచంద్ర, డైరెక్టర్లు సుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, యాజమాన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక ఆరోగ్యం సూర్య నమస్కారాలతోనే సాధ్యం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక భావన సూర్య నమస్కారాలతోనే సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. వసంత పంచమి,రథ సప్తమి పర్వ దినాలను పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేకువజామున స్థానిక జిల్లా పరిషత్ కల్యాణ మండపంలో 100 మంది యోగ సాధకులతో 108 పర్యాయాలు సూర్య నమస్కారాల ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం నేపథ్యంలో జరిగిన సూర్య నమస్కారాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను నేడు సూర్య నమస్కారాలతో ప్రారంభిస్తారన్నారు. బ్రహ్మ ముహూర్తంలో ఆచరించే సూర్య నమస్కారాలవల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక భావన పెరుగుతుందని అన్నారు. సూర్య నమస్కారం యొక్క నిరంతర అభ్యాసంతో మెరుగైన మానసిక స్పష్టత, ఏకాగ్రతకు దారితీస్తుందన్నారు. సూర్య నమస్కారాలు కేవలం భౌతిక సాధన కాదని, మనస్సు-శరీర అవగాహనను కూడా పెంపొందించుకోడానికి దోహద పడతాయన్నారు. శారీరక, మానసిక భావోద్వేగ శ్రేయస్సుకు యోగా అనేది అత్యంత విశిష్టమైన వ్యాయామం అని అన్నారు. యోగాలో పలు ఆసనాలు, ప్రాణయామం లాంటి శ్వాసక్రియ అభ్యాసాలు, వివిధ భంగిమలతో కూడిన సూర్యనమస్కారాలు అలాగే ధ్యాన ముద్రలు భాగంగా ఉంటాయన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, మంత్రము, ధ్యానం ఇలా అన్నింటిని మిళితం చేసే సంపూర్ణ సాధనే సూర్య నమస్కారం అని అన్నారు. యోగా గురువులు సూర్యోదయం సమయాన సూర్యునికి అభిముఖంగా నిలబడి సూర్య నమస్కారాలు చేస్తారని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో 100 మంది 108 సార్లు సూర్య నమస్కారాలు,12 రకాల ఆసనాలు చేశారు. టీటీడీ ధర్మచారిని జొన్నలగడ్డ మాధవి భగవద్గీత పారాయణం చేశారు. ఈ మెగా ఈవెంట్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం చోటుచేసుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. యోగా గురువులు ఘంటసాల గురునాథ బాబు, చింతయ్య, మహాలక్ష్మి, ముదిగొండ శాస్త్రి, ఆర్.డి ప్రసాద్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### నూతన డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి అభినందనలు తెలిపిన 'పెన్'

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి హరీష్ కుమార్ గుప్తాను, పెన్ జాతీయ సంఘం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘ కార్యదర్శి బడే ప్రభాకర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) సంఘ నేతలు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ మేరకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్ రాష్ట్ర సంఘ నేతలు తాడి రంగారావు, అర్జ శ్రీధర్, టివి రంగారావు, టీవీ శ్రీనివాస్, విజయ్ కుమార్, తదితరులున్నారు.

### నూతన దంపతులను ఆశీర్వదించిన విక్కుర్తి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో రిసెప్షన్ జరుపుకుంటున్న నూతన దంపతులను ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. స్థానిక రెండవ వార్డుకు చెందిన మట్టా వెంకట శేషగిరి రావు కుమారుడు నాగ వికాస్, భీమేశ్వరి దంపతుల వివాహం అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో జరిగింది. ఆదివారం అవనిగడ్డ లోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నూతన దంపతుల రిసెప్షన్ జరగ్గా హాజరైన విక్కుర్తి నూతన వధూవరులను ఆశీర్వదించి, కొంత నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, బర్మా శ్రీనివాసరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### గన్నవరం నియోజకవర్గ పరిశీలకులుగా కోటా వీరబాబు



**నందిగామ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్య దర్శి, నాగార్జున సాగర్ లాల్ బహదూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, నందిగామ నియోజక వర్గ సీనియర్ నాయకుడు కోట వీరబాబును కృష్ణా జిల్లా గన్నవరం నియోజక వర్గంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ పరిశీలకునిగా రాష్ట్ర తెలుగు దేశం పార్టీ నియమించింది. ఈ సందర్భంగా వీరబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999